క్లుప్తంగా

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



బీజామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న పద్మ

సింహాచలం : బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తే పంటలకు చీడపీడలు, తెగుళ్లు సోకకుండా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ బి.పద్మ తెలిపారు. పెందుర్తి మండలం గొరపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం ప్రకృతి సాగు రైతులకు సామూహికంగా బీజామృతం ఎలా తయారు చేయాలో అవగాహన కల్పించారు. బీజామృతాన్ని తయారుచేసి ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘ బృందం

పరవాడ: ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ సభ్యుల బృందం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి ఘనంగా సత్కరించింది. పెందుర్తి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ చైర్మన్ కూండ్రపు కృష్ణంనాయుడు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు అందజేశారు. ఎమ్మెల్యేను నాయుడుపాలెం సర్పంచ్ కె.వరలక్ష్మి, సీతారామయ్య, కె.ఉమామహేశ్వరి, ఎం.వెంకినాయుడు, కృష్ణబాబు, యమహానాయుడు, కన్నూరు నరేష్ కలిశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

డాబాగార్డెన్స్: వర్షాకాలం దృష్ట్యా వార్డుల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా పోయేలా ప్రధాన గెడ్డల్లో వ్యర్థాలు తొలగించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి జోన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు గుర్తించి, అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అండర్ బ్రిడ్జిల ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు మోటార్ల సహాయంతో తొలగించాలని ఆదేశించారు.

సబ్బవరం డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికి నూతనంగా కంప్యూటర్ సైన్స్ కోర్సులు మంజూరైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి గురువారం తెలియజేశారు. వీటిలో బీఎస్సీ కంప్యూటర్స్, మ్యాథమెటిక్స్, బీకామ్ జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు ఉన్నాయన్నారు. వీటితోపాటు బీఎస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, బీఎస్సీ బోటనీ, జువాలజీ, బీఏ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ కోర్సులలో చేరేందుకు ఈ నెల 12లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీలోగా గ్రూపు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు.

స్మార్ట్ నానో టెక్నాలజీతో జీవన ప్రమాణాల పెంపు

కొమ్మాది: స్మార్ట్ నానో టెక్నాలజీతో మానవ జీవన ప్రమాణాలు పెంచడానికి పరిశోధకులు కృషి చేయాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం, ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ నెల 8 వరకు నిర్వహిస్తున్న స్మార్ట్ నానో టెక్నాలజీస్ అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణం, వైద్య రంగం, శక్తి ఉత్పాదక రంగాల్లో నానో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సుస్థిర అభివృద్ధికి సహజ వనరులను పొదుపుగా వినియోగించడానికి నానో టెక్నాలజీ పరిశోధనలు దోహదపడాలన్నారు. ఈ సదస్సులో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 50 మందికి పైగా శాస్త్రవేత్తలతోపాటు డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అందరికీ మేలు



'జగనన్న సురక్ష' కార్యక్రమంలో నాయకులు



జగనన్న సురక్ష క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనిచేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా సబ్బవరంలోని నాలుగు సచివాలయాల వలంటీర్లు, సిబ్బంది, గృహ సారథులకు గురువారం నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాల మేరకు వీలైనంత ఎక్కువ మందికి పథకాలు అందజేసేందుకు కృషి చేయాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు సమన్వయంతో 'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలన్నారు. గతంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినప్పటికీ మరోసారి శిక్షణ అందిస్తుండడంతో కార్యక్రమం ఉద్దేశ్యం, ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ రాష్ట్రంలో నడుస్తుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకే సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేయలేదని, అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, 'జగనన్న సురక్ష' నియోజకవర్గ ఇన్‌చార్జి కోటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ గోర్లి ఉమా మహేశ్వరరావు, ఈవోపీఆర్డీ మహేష్, బోకం రామునాయుడు, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడు, బంతికోళ్ల పద్మ, హేమంత్, బోను గంగునాయుడు, బండారు శ్రీను, యర్రంశెట్టి రాము, దనిమిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోవాలి

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ×జగనన్న సురక్ష× కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు కోరారు. బొద్దపువానిపాలెం గ్రామంలో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమం ద్వారా 11 సేవలు పొందవచ్చని, అవసరమైన వారు వలంటీర్లకు దరఖాస్తులు అంజేయాలని కోరారు. కార్యక్రమంలో ఈ.బోనంగి ఉప సర్పంచ్ మేడిశెట్టి వెంకటరమణ, పార్టీ నాయకులు బి.అప్పారావు, కె.భాస్కరరావు, సీహెచ్.రాజబాబు, ఎస్.శ్రీనివాసరావు, బి.అప్పలరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలు విజయవంతం చేద్దాం

- పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపు
- 95వ వార్డు కృష్ణరాయపురంలో ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం 95వ వార్డు కృష్ణరాయపురంలో నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పెందుర్తి మండలంలోని రాంపురంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కృష్ణరాయపురంలో ఉన్న ఏటీ రాయుడు గొడౌన్స్ ప్రాంగణంలో శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో భాగంగా భారీ ఎత్తున సభ కూడా నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ వేడుకలకు టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి హాజరవుతారని చెప్పారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు చేరువయ్యారని చెప్పారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సుమారు 15 వేల మంది సభకు వస్తారని అంచనా వేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, పార్టీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, 94వ వార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, 93వ వార్డు నాయకులు దాసరి సత్తిబాబు, బండి సత్తిబాబు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పెందుర్తి సర్వీస్ రోడ్డు ప్రారంభం

రూ.12 కోట్లతో జరుగుతున్న పెందుర్తి సర్వీస్ రోడ్డు మరమ్మతు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ఎమ్మెల్యే తెలిపారు. ఈ రోడ్డు పనులు పూర్తి కాగానే ప్రారంభోత్సవం కూడా చేస్తామన్నారు.

సుందరంగా వైఎస్సార్ విగ్రహం



కలపాకలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం

పరవాడ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఈ నెల 8న నిర్వహించేందుకు కలపాక గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు వైఎస్సార్ విగ్రహాన్ని సర్పంచ్ బొండా కనకారావు సొంత నిధులు వెచ్చించి పెయింటింగ్ వేసి ముస్తాబు చేశారు. ఆ రోజు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని సర్పంచ్ తెలిపారు.

ఆరోపణలు చేయడమే 'బండారు' పని

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ధ్వజం

సింహాచలం: వైఎస్సార్‌సీపీ నేతలపై మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. చినముషిడివాడ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు కబ్జాకు పాల్పడి, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బండారు ఈ నెల 2న చేసిన ఆరోపణల విషయంపై గురువారం రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే స్పందించారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇప్పటికే ఆ స్థలం గురించి ముమ్మన దేముడు వాస్తవాలు వివరించారన్నారు. గతంలో బండారు కలెక్టరేట్‌కు వెళ్లి పినగాడిలో స్థలాలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకులు కబ్జా చేసేస్తున్నారని ఆరోపించారని, ఆరోపణలు తప్పు అయితే ఉరివేసుకుంటానని చెప్పారని గుర్తు చేశారు. దానిపై తాను పూర్తి వివరాలతో వివరణ ఇచ్చానని తెలిపారు. బండారు పెద్ద తరహా వ్యక్తిగా వ్యవహరించాలని సూచించారు.

మహిళా మార్టుల్లో పొదుపు సంఘాలకు ప్రాధాన్యం



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏపీడీ రాము

గాజువాక: వ్యాపారం చేయాలనుకునే పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా మద్దతు లభిస్తుందని జీవీఎంసీ గాజువాక జోనల్ యూసీడీ సహాయ ప్రాజెక్టు అధికారి ఎల్.రాము తెలిపారు. నవరత్నాల్లో మెప్మా పాత్ర అంశంపై ఆరు వార్డుల పొదుపు సంఘాల రిసోర్స్ పర్సన్లకు గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఏవైనా ఉత్పత్తులు తయారు చేసే యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుంచి మార్కెటింగ్ మద్దతు లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం మహిళా మార్టులను ప్రారంభించనుందని, వాటిలో మహిళా సంఘాలకు ప్రాధాన్యం కల్పిస్తారని పేర్కొన్నారు. సంస్థను ఏర్పాటు చేసుకోవడం మొదలు ఉత్పత్తులను విక్రయించే వరకు అన్ని రకాలుగా మద్దతు లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై రిసోర్సు పర్సన్లు పొదుపు సంఘాల సభ్యులకు వివరించాలన్నారు. అనంతరం, జిల్లా రిసోర్సు పర్సన్లు ధనుంజయరావు, కె.శ్రీనివాసరావు, నవమణి తదితరులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

జీవామృతంతో పెరగనున్న భూసారం



జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న హేమసుందర్

ఆనందపురం : పంటలకు జీవామృతాన్ని వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు రావడమే కాకుండా భూసార స్వభావం పెరుగుతుందని రైతు సాధికార సంస్థ ప్రాంతీయ అధికారి హేమ సుందర్ చెప్పారు. మండలంలోని తర్లువాడలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు గురువారం మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారని చెప్పారు. ఇందులో జీవామృతం ప్రధాన భూమిక పోషిస్తుందని, దీన్ని కాలువుల్లోని నీటితో కలిపితే అందులో ఉన్న బ్యాక్టీరియా నేలలోని పోషకాలను కరిగించి మొక్కలకు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా 10 ఎకరాల్లో సాగు చేస్తున్న 17 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం, జీవామృత తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి మోహనరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సబ్బవరం : మండలంలోని సబ్బవరం సెక్షన్ – 1, సెక్షన్ – 2 పరిధిలోని 33 కేవీ ఫీడర్ల నిర్వాహణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

గోపాలపట్నం: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపట్నం రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన డొపా సీతారామ్(అలియాస్ రాము) (50) ప్రైవేటు పనులు చేస్తూ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా చీపురుపల్లి వెళ్లిన అతడు ఈ రోజు ఉదయం తిరుగు ప్రయాణమయ్యాడు. సింహాచలం రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

875వ రోజుకు దీక్షలు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 875వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కేంద్రం తీరును మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

మర్రిపాలెం: మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, కంచరపాలెం పోలీసులు సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ దరి బర్మాక్యాంప్ వద్ద ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేయగా పెంటాజోసిన్, లేక్టేట్ (1ఎంఎల్) 850 ఇంజెక్షన్లు లభ్యమయ్యాయి. షాపు యజమాని గెద్దం కళ్యాణ్, ప్రసాద్, పెదపూడి రాంప్రసాద్ కలిసి ఈ ఇంజక్షన్లను విక్రయిస్తున్నట్టు తేలింది. వారిని అదుపులోకి తీసుకుని మత్తు ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

సబ్బవరం : మండలంలో బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఘనంగా నివాళులర్పించారు. అమరపిన్నివానిపాలెం, అంతకాపల్లి గ్రామాల్లోని విగ్రహాలకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల కన్వీనర్ బొర్రా జయరాజ్ ఆధ్వర్యంలో సమితి సభ్యులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనకాపల్లి జిల్లా కన్వీనర్ గోటివాడ సామ్రాట్ కుమార్, దువ్వి దుర్గాలు, ఇందుగబిల్లి గోపి, కొమ్ము కోటి, పెట్ల ఈశ్వరరావు, సూర్యప్రకాష్, నాయుడు, గణేష్ పాల్గొన్నారు.

డిప్లొమా పారా మెడికల్ కోర్సులకు నోటిఫికేషన్

అక్కిరెడ్డిపాలెం: డిప్లొమా పారామెడికల్ కోర్సులకు ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్ పాసైన ఏ గ్రూప్ విద్యార్థులైనా అర్హులేనని పేర్కొన్నారు. డిప్లమా అనస్థీషియా, ఎంఎల్‌టీ, రేడియాలజీ, డీఎంఎస్‌టీ, కార్డియాలజీ, క్యాథ్‌ల్యాబ్, డయాలసిస్, పెర్ఫ్యూజన్, రెస్పిరేటరీ థెరపీ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు ఉంటాయని తెలియజేశారు. కన్వీనర్ కోటా సీట్లకు ఈ నెల 24 వరకు, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు ఆగస్టు 24 వరకు గడువుగా పేర్కొన్నారు. కన్వీనర్ సీటు కోటాకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని తెలియజేశారు. వివరాలకు షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌ని బొల్లినేని మెడ్‌స్కిల్స్ నందు లేదా 7207953919, 7995013421 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు



కల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన జరిపించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. ఉభయదాతలను స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు కుటుంబ సమేతంగా పూజలో పాల్గొన్నారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

ఘనంగా జునోసిస్ దినోత్సవం



సబ్బవరం పశువైద్య కేంద్రంలో కుక్కలకు ఉచిత టీకా ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీ ఉషాకుమారి



పెందుర్తి పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకా వేస్తున్న వైద్యుడు డాక్టర్ జగన్‌మోహన్‌రావు

సబ్బవరం: ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని సబ్బవరం మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం, ఆరిపాక, గుల్లేపల్లి, అంతకాపల్లి పశువైద్య కేంద్రాలతో పాటు రైతు భరోసా కేంద్రాలలో 145 కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్ వేసినట్టు సబ్బవరం ప్రాంతీయ పశువైద్య కేంద్రం సహాయ సంచాలకురాలు డాక్టర్ కె.ఉషాకుమారి తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు

సింహాచలం: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెందుర్తి పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. మొత్తం 327 కుక్కలకు టీకాలు వేశామని వైద్యాధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు తెలిపారు. అనంతరం జునోసిస్ వ్యాధుల గురించి పెంపుడు జంతువల యజమానులకు అవగాహన కల్పించారు.

బదిలీపై వెళ్లిన పోలీసులకు సన్మానం



పోలీసులను సత్కరిస్తున్న సీఐ రంగనాథం, తదితరులు

సబ్బవరం: ఇటీవల బదిలీపై వెళ్లిన పోలీసు సిబ్బంది వీడ్కోలు కార్యక్రమం సబ్బవరంలోని ముత్యం కల్యాణ మండపంలో గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సీఐ రంగనాథం మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా పారదర్శకంగా సేవలందించే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల మనసులో స్థానం ఉంటుందన్నారు. సబ్బవరం పోలీస్ స్టేషన్ నుంచి పలు స్టేషన్లకు బదిలీపై వెళ్లిన హెచ్‌సీలు మల్లేశ్వరరావు, పి.వి.రమణ, కె.కిశోర్, పీసీలు బి.డి.నాయుడు, పి.శివ కృష్ణ, పి.గౌతమ్, సిహెచ్.శ్రీను, ఎల్.శకుంతలకు సీఐ జ్ఞాపికలు అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఎల్.సురేష్, సత్యనారాయణ, హెచ్‌సీ కె.టి.ఎస్.శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

యువకుడిని కబళించిన లారీ



ఘటనా స్థలంలో పూతి మహేష్ మృతదేహం, ప్రమాదానికి కారణమైన లారీ

అక్కిరెడ్డిపాలెం: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యువకుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంనకు చెందిన పూతి మహేష్(25) స్విగ్గీలో పని చేస్తున్నాడు. మహేష్ గురువారం ద్విచక్ర వాహనంపై గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది.

ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో.. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని.. ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ అవివాహితుడు. అతని తల్లిదండ్రులు వీరఘట్టంలోనే ఉంటున్నారని ఎస్ఐ తెలిపారు.

ఏవీకే డిగ్రీ కళాశాల మూసివేతపై ఆందోళన



ఏయూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: గాజువాకకు చెందిన ఏవీకే డిగ్రీ కళాశల అర్ధాంతరంగా మూసివేతపై ఆంధ్ర విశ్వవిద్యాలయం మెయిన్‌గేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఆ కళాశాల విద్యార్థులు ఆందోళన చేశారు. కళాశాలలో చదువుతున్న 400 మందికి పైగా విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

కళాశాల మూసివేస్తున్నట్లు యాజమాన్యం తమకు చెప్పిందని, వేరొక కళాశాలలో చేరాలని సూచిస్తున్నారని వాపోయారు. కళాశాలను కొనసాగించాలని, తరగతులను తక్షణం నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అనంతరం ఏయూ సీడీసీ డీన్ ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కళాశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని డీన్ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు, సభ్యులు జి.పల్లవి, ఎం.శశి కుమార్, సాయి తేజ, ఎం.తేజ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.